


# భక్తికి గణిత సూత్రాలు

## భక్తి భావన పై సరికొత్త దృక్కోణం



నీ బుర్రలో తెలివి సున్నా అంటారు - ఏమీ తెలియని వాళ్ళని. కానీ అన్నీ తెలుసనుకున్నవాళ్ళక్కూడా - సున్నా అనేదుందని మనవాళ్ళు కనిపెట్టేకనే తెలిసింది. సున్నా తర్వాత వచ్చే అంకెలు 1,2,3 వగైరాలు. మరి సున్నాకి ముందు అంకెలుండవా?

ఉంటాయంటుంది గణితశాస్త్రం. సున్నా తర్వాత వచ్చే అంకెలన్నీ ప్లస్ కాబట్టి సున్నాకి ముందు వన్నీ మైనస్ అన్నమాట. ఈ మైనస్‌లో చాలా తమాషాలుంటాయి. ప్లస్‌లో పెరిగేకొద్దీ అంకె పెద్దదైతే మైనస్‌లో పెరిగేకొద్దీ అంకె చిన్నదౌతుంది. అంటే +10 కంటే +20 పెద్దది. - 10 కంటే - 20 చిన్నది. ఇది తిరకాసుగా అనిపిస్తే ప్లస్ అంటే ఆస్తి, మైనస్ అంటే అప్పు అనుకోవాలి. 10 రూపాయలున్నవాడికంటే 20 రూపాయలున్నవాడు గొప్ప. 10 రూపాయల అప్పున్నవాడు 20 రూపాయల అప్పున్నవాడికంటే గొప్ప.

ఎవరైనా ఆస్తినే కోరుకుంటారు. అప్పుంటే దాన్నించీ బయటపడి ఆస్తిపరులు కావాలనుకుంటారు. కాబట్టి గణితశాస్త్రం ఆదిలోనే మైనస్‌ని ప్లస్ చేసే రెండు ఉపాయాలు కనుక్కుంది. అందులో మొదటిది మైనస్ కంటే పెద్దదైన ప్లస్ అంకెను తెచ్చి కలపడం. ఉదాహరణకు -10కి +20 కలిపితే +10 అవుతుంది. అంటే పదిరూపాయల అప్పున్నవాడికి 20 రూపాయలిస్తే వాడి బాకీ పదిరూపాయలు పోగా ఇంకా పది రూపాయలు మిగులుతాయి. అంటే ఇక్కడ మైనస్‌ని ప్లస్ చేయడానికి ప్లస్ కొంత నష్టపోయింది. అలాంటి నష్టంలేకుండా మైనస్‌ని ప్లస్ చేయాలంటే మైనస్‌తో హెచ్చవేయాలి. ఉదాహరణకు -10ని -10 తో హెచ్చవేస్తే వచ్చేది +100. అంటే ఒక్క అంకె కూడా నష్టపోకుండా మైనస్ ప్లస్సై పోయింది. మైనస్ ఇంటూ మైనస్ =ప్లస్ అన్నది గణిత శాస్త్రపు ఫార్ములా. వచ్చిన సమస్యేమిటంటే మైనస్‌ని ఎంత పెద్ద ప్లస్‌తో హెచ్చవేసినా ఫలితం మైనస్సే తప్ప ప్లస్ కాదు.

ఈ ఫార్ములాకు నిత్య జీవితంలోనూ ప్రాధాన్యముంది.

ముల్లును ముల్లుతోటే తియ్యాలంటారు సామాన్యులు. ఉష్ణం ఉష్ణేన శీతలం అంటారు పండితులు. వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలంటారు భాగ్యవంతులు. రక్తానికి రక్తమే బదులంటారు సినీహీరోలు. సమస్య మైనస్ అనుకుంటే దాని పరిష్కారమూ ఆ మైనస్‌తోనే లభిస్తుందని లోకజ్ఞులంటారు. మన ఈ ఫార్ములాని అనుసరించే కథలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు ఉద్దాలకుడి కథను పరిశీలిద్దాం.

ఉద్దాలకుడి భార్య చండిక భర్త ఏం చెబితే దానికి వ్యతిరేకంగా చేసేది. అటు బ్రహ్మ చర్యానికీ, ఇటు గృహస్థాశ్రమానికీ కాకుండా చెడ్డానని బాధపడుతూ తన గోడు కౌండిన్యుడనే ఋషికి చెప్పుకున్నాడాయన. "కట్టుకున్న పెళ్ళాన్ని విడువరాదు. కాబట్టి ఆమెనుంచీ నీవేమి కోరుతున్నావోదానికి వ్యతిరేకంగా చెప్పు"అని ఆ ఋషి ఉద్దాలకుడికి సలహా ఇచ్చాడు. అది చక్కగా పని చేసింది. ఉద్దాలకుడికి రోజులు సుఖంగా గడిచిపోతున్నాయి.

ఒకరోజు ఉద్దాలకుడి తండ్రి తద్దినం. ఆయన భార్యతో, "నా తండ్రి తద్దినానికి భోక్తలొస్తారు. నువ్వు స్నానం చేయకుండా పాచి బట్టలతో వంటచేయి" అన్నాడు. చండిక వెంటనే స్నానం చేసి మడిగా వంటచేసింది. భోక్తలొచ్చేక "నువ్వు వడ్డన చేయకు" అన్నాడాయన. ఆమె తనే స్వయంగా వడ్డించింది. అలా ఒకో పనే స్క్రమంగా ఐపోతుంటే ఉద్దాలకుడు పొంగిపోయి, "పారణం జాగ్రత్త చేయి" అన్నాడు. అంతే - మైనస్ ఇంటూ ప్లస్ = మైనస్. ఆమె పారణాన్ని పెంటమీద పారేసింది. ఈనగాచి నక్కల పాల్జేసినట్లు పితృకార్యం చెడిపోయింది.

ఈ కథలో చాలా గొప్పనీతి ఉంది. చండిక సహజగుణం మైనస్. ఉద్దాలకుడి సహజగుణం ప్లస్. భార్యకోసమని ఉద్దాలకుడికి ప్లస్‌నే ప్రమాదం చేసింది. చెడుని చెడుతోనే ఎదుర్కోవాలంటే మనిషికి మంచి కూడా చెడు అయ్యే ప్రమాదముంది.

అంటే నిత్యజీవితంలో మైనస్ ఇచ్చేప్రయోజనం తాత్కాలికం. తర్వాత అది ప్రమాదకరంగా పరిణమించే అవకాశం కూడా ఉంది.

అన్నీ తెలిసీ మనిషి మైనస్ వైపే మొగ్గుతూంటాడు. ఎందుకంటే మనిషికి అడ్డదార్లంటే మక్కువ ఎక్కువ. అసలు మైనస్ అంటేనే అడ్డదారి అని జయవిజయుల కథ చెబుతుంది.

ఒకప్పుడు సనక సనందనాది మునులు శ్రీ మహా విష్ణువును సందర్శించాలని వైకుంఠానికి వెడితే వాళ్ళను కాసేపు ఆగమన్నారు ద్వారపాలకులైన జయవిజయులు. మునులు కోపగించి వారిని రాక్షసులు కమ్మని శపించారు. అప్పుడు విష్ణువు వారితో, "మునుల శాపం అమోఘం. మీరు రాక్షసులు కాక తప్పదు. తిరిగి నన్ను కలుసుకుందుకు నాకు భక్తులుగా ఏడు జన్మలెత్తుతారో, నన్ను ద్వేషించే మూడు జన్మలెత్తుతారో అది మీ ఇష్టం" అన్నాడు. విష్ణువును త్వరగా కలుసుకోవాలన్న ఆత్రంలో వారు ద్వేషాన్నే కోరుకుని హిరణ్యాక్షహిరణ్య కశిపులుగా, రావణ కుంభకర్ణులుగా, శిశుపాలదంతవక్త్రులుగా మూడు జన్మలెత్తారు.

మూడు జన్మలు జయవిజయులకు అడ్డదారే కావచ్చు. కానీ ఆ జన్మల్లో వారు లోకకంటకులై సామాన్యులను గగ్గోలెత్తించారు. తమనంతం చేయడానికి శ్రీమహావిష్ణువంతటివాణ్ణి భూమ్మీదకు రప్పించారు. యుగాలు గడిచినా జయవిజయుల జన్మలను మానవులు ఏవగించుకుంటూనే ఉన్నారు.

ఈ కలికాలంలో కూడా మనిషికి పాపభీతి ఉంది. అందుకే పుణ్యతీర్థాల్లో రష్ పెరుగుతోంది. దేవుడి హుండీల్లో నిధులు పెరుగుతున్నాయి. ఊరూరా ప్రత్యక్ష దైవాలు వెలిసి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిన్నింటికీ ముఖ్యకారణం ఒక్కటే. మనిషి పాపాలు మానలేక పోతున్నాడు. ఆ మైనస్‌ని ప్లస్ చేయడానికి పుణ్యమనే పెద్ద ప్లస్‌ని ఆశ్రయిస్తున్నాడు. పాపాలు కడిగేసుకుందుకు మాత్రమే పుణ్యకార్యాలు చేసేవారు కోకొల్లలు. అలాంటి వారికి మైనస్ ఇంటూ ప్లస్ కూడా మైనస్సే తెలియదు. అదెలాగో ఈ చిన్న కథ చక్కగా చెబుతుంది.

ఓ పిసినారి అనుకోకుండా పిల్లిని చంపాడు. ఆ పాపాన్ని పోగొట్టుకుందుకు బంగారు పిల్లిని దానం చెయ్యాలంటే మనసొప్పక ఊరుకున్నాడు. చివరికో పేద బ్రాహ్మణుడాయన వద్దకు వెళ్ళి, "పిల్లిని చంపడం మహాపాపం. నువ్వు నాకో రూపాయిస్తే నీ కొచ్చిన ఆ పాపాన్ని నేను తీసుకుని ఆ తర్వాత జపతపాలు చేసి ఆ పాపం నుంచీ విముక్తిడినౌతాను" అన్నాడు. పిసినారి సరేనని ముందా బ్రాహ్మణుణ్ణి తన పాపాన్ని తీసుకోమన్నాడు. ఆపేద బ్రాహ్మణుడేవో మంత్రాలు చదివి పిసినారి పాపం తనకొచ్చేసిందన్నాడు. పిసినారి వెంటనే, "పిల్లిని చంపిన పాపం నువ్వు భరించు. నీకు రూపాయి ఇవ్వని పాపం నేను భరిస్తాను" అని పేద బ్రాహ్మణుడికి పైసా కూడా ఇవ్వకుండా పంపేసాడు. పిసినారికి తెలియదు - తనకు పిల్లిని చంపిన పాపంతో పాటు పేదవాణ్ణి ఆశపెట్టి రూపాయి ఎగేసిన పాపం కూడా అంటుకుంటుందని. అదే మైనస్ ఇంటూ ప్లస్ మైనస్ అవడమంటే.

ముఖ్యంగా - కోడళ్ళి రాచిరంపాన పెట్టి దేవతలకు చీరలు, నగలు ఇచ్చే అత్తలూ, హత్యకు చేసి గంగలో మునిగే గూండాలూ, స్కాముల్లో ప్రజాధనం కాజేసి దేవుడి హుండీల్లో

కోట్ల ధనం వేసే ప్రజానేతలూ ఈ గణిత సూత్రాన్ని తెలుసుకోవాలి.

మరి ఈ మైనస్ నుంచీ బయటపడే మంచి మార్గమే లేదా అంటే అందుకూ ఓ గణిత సూత్రముంది. ఈ ప్లస్సూ, మైనస్సుల్లాగే గణితంలో అనంతం అనే పదమొకటుంది. ఆంగ్లంలో ఇన్ఫినిటీ అనబడే ఈ అనంతంతో ఎంత ప్లస్ కలిసినా, ఎంత మైనస్ కలిసినా అది ఏ మార్పూ లేకుండా అనంతంగానే ఉండిపోతుంది. సామాన్యుడి ఊహకు అనంతం సముద్రపు నీటిలాంటిది.

మనిషికి ఈ అనంతపు ఊతనిచ్చేదే భక్తి. భక్తి మనిషి సమస్త పాపాలనూ కడిగేస్తుంది. మనిషి నుంచి పాప చింతనను తొలిగిస్తుంది. అంటే పాపి భక్తుడు కాగలడు కానీ భక్తుడు పాపి కాలేడు. మన పురాణాల్లో ఎన్నో కథలున్నాయి. ఓ దొంగ శివరాత్రినాడు ఉపవాసముండి దేవుడిముందు దీపం వెలిగించి మరణిస్తే అతడికి కైలాసం లభించింది. ఓపాపి చనిపోయేముందు నారాయణ నామస్మరణ చేస్తే అతడికి వైకుంఠ యోగం కలిగింది. భక్తిలోని అనంతతత్వాన్ని తెలియజేయడం ఆ కథల పరమార్థం.

భక్తి కేవలం నమ్మకం కాదు. అది ఒక గొప్ప మానసికానుభూతి. శాస్త్రీయంగా తీసుకుంటే భక్తికి గణితసూత్రాలున్నాయని గ్రహించవచ్చు. ఐతే అనంతమైన భక్తిగిరి విశ్వరూపాన్ని సందర్శించడానికి ఏ గణిత సూత్రాలూ చాలవు. ఆ దిశలో మేము చేసే ప్రయత్నాలు మున్ముందు వ్యాసాల్లో కనిపిస్తాయి. అవి కొండను అద్దంలో చూపేవి మాత్రమేనని మనవి.

## ఇలా అన్నారు

*సంఘం నించి విడిబడ్డవాళ్ళు సంఘానికి యేదో వ్యతిరిక్తంగా నడుచుకుని వుంటారు. వ్యతిరిక్త ప్రవర్తన న్యాయమనీ, సంఘ మూర్ఖత్వమే తమని వెలిబరిచిందనీ, విశ్వాసముంటేనేగానీ వొంటరితనాన్ని, సంఘ నిర్లక్ష్యాన్నీ, తిరస్కారాన్నీ ప్రజలు భరించలేరు. తాము సత్యాన్ని నమ్మామనీ, సంఘానికి ఆదర్శం చూపుతున్నామనీ, వుండే విశ్వాసమే వారికి బలమై 'లోన్లీ' గా వుండడం ఇబ్బంది లేకుండా కాపాడుతుంది. తమ బాధకి అర్థమూ, ప్రయోజనమూ వున్నదని సమర్థించుకోగలరు. ఇతరులు తమని దూషిస్తే ప్రజల మూర్ఖత్వమనీ, సంస్కర్తలు నవ్వుకుంటారు కానీ ఆగ్రహపడరు. తాము తమ జీవితంలో అవలంబించిన సంస్కరణం, ఆత్మ సంస్కారానికే గాక సంఘ సంస్కారానికి కూడా ఉపయోగపడుతుంది.*

*బ్రాహ్మణీకం లో చలం (రచనా కాలం: 1930)*